క్లుప్తంగా

జాగ్రత్తలు పాటించాలి



చెల్లూరు ప్రధాన కాలువ వద్ద నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

రాయవరం: వినాయక విగ్రహాల నిమజ్జనం సమయంలో ఉత్సవ కమిటీలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్సై సురేష్‌బాబు సూచించారు. మండలంలోని మాచవరం, పసలపూడి, చెల్లూరు, వెంటూరు గ్రామాల్లోని ప్రధాన కాలువల వద్ద నిమజ్జన ప్రదేశాలను ఆయన మంగళవారం పరిశీలించారు. ఎస్సై మాట్లాడుతూ, పగటి సమయాల్లోనే నిమజ్జనాలు చేయాలని, చిన్నారులు, వృద్ధులు కాలువల్లోకి దిగకుండా చూడాలన్నారు. నిమజ్జనం చేసే ప్రదేశాల్లో పంచాయతీ కార్యదర్శులు హెచ్చరిక బోర్డులు, కాలువ లోపలికి వెళ్లకుండా బారికేడ్లు, ఫ్లడ్‌లైట్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈనెల 4న అధిక సంఖ్యలో నిమజ్జనాలు జరిగే అవకాశముందన్నారు.

నేడు ఎలుకల మందు పంపిణీ

కపిలేశ్వరపురం (మండపేట): వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండపేట మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో ఉదయం 9 గంటలకు ఎలుకల మందును పంపిణీ చేయనున్నట్టు మండల వ్యవసాయాధికారి కె.ప్రభాకరరావు తెలిపారు. బ్రోమైడియోలిన్‌ను ఉచితంగా అందజేస్తున్నామని, వరి నూకలతో కలిపిన మిశ్రమాన్ని వ్యవసాయ క్షేత్రంలో ఎలుకల బొరియల వద్ద అమర్చుకోవాలని సూచించారు.

డీఎస్సీ విజేతలకు సత్కారం



వెలగతోడు జెడ్పీ స్కూల్‌లో డీఎస్సీ విజేతలను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

కపిలేశ్వరపురం (మండపేట): వెలగతోడుకి చెందిన ఇద్దరు యువకులు ఉపాధ్యాయ కొలువులను సాధించిన వారిని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సొంటేని శ్రీనివాసరావు సత్కరించారు. గ్రామానికి చెందిన మాచర్ల మణికంఠ తాపీ పని చేస్తూ కుటుంబానికి చేదోడు వాదోడుగా నిలిచాడు. గ్రామానికి చెందిన మల్లు సన్యాసిరావు రోడ్డు రోలర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవితాన్ని గడిపాడు. వారిద్దరూ 1వ తరగతి నుంచి ప్రభుత్వ పాఠశాల్లోనే చదివారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు యేసు రాజు, వీర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

త్రిసభ్య కమిటీల ప్రమాణ స్వీకారం

కపిలేశ్వరపురం (మండపేట): మండలంలోని కోరుమిల్లి, మాచర పీఏసీఎస్ త్రిసభ్య కమిటీల సభ్యులు మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. కోరుమిల్లి పీఏసీఎస్ చైర్మన్‌గా తుట్టువు లోవరాజు, సభ్యులుగా దంగేటి శ్రీనివాస్, సవరపు రాంబాబు ప్రమాణం చేశారు. మాచర పీఏసీఎస్ చైర్మన్‌గా గుర్రాల సత్య తారాకృష్ణ, సభ్యులుగా బడుగు నల్ల బాబు, మామిడిశెట్టి సూర్యనారాయణ బాధ్యతలను స్వీకరించారు.

9 మంది జూదరుల అరెస్ట్

రామచంద్రపురం రూరల్: పేకాడుతున్న 9 మంది జూదరులను అరెస్ట్ చేసినట్లు ద్రాక్షారామ ఎస్సై ఎం.లక్ష్మణ్ మంగళవారం విలేకరులకు తెలిపారు. మండలంలోని చిన్న తాళ్లపొలం శివారులో పేకాడుతున్నట్లు సమాచారం రావడంతో తన సిబ్బందితో దాడి చేసి వారిని అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.14,830 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరు పరచనున్నట్లు తెలిపారు.

ప్లాస్టిక్‌ను ఉపయోగించవద్దు

అంబాజీపేట: ప్లాస్టిక్ పేపర్లు, కవర్ల వల్ల కాలుష్యానికి హాని కలిగించడమే కాకుండా క్యాన్సర్, అనారోగ్యానికి గురవుతామని, వాటికి పూర్తిగా స్వస్తి చెప్పాల్సిన బాధ్యత మనందరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్ అన్నారు. అంబాజీపేట పీహెచ్‌సీలో వైద్యాధికారి కేఎన్ శ్రీనివాస్ అధ్యక్షతన ఆశా డే కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. శ్రీనివాస్ మాట్లాడుతూ రీ సైక్లింగ్, ప్లాస్టిక్ పేపర్ వాడకం వలన రోగాలు వస్తున్నాయన్నారు. గ్రామంలో ఉన్న హోటల్స్, స్వీట్ స్టాల్స్, చాట్ బండ్లు, మాంస విక్రయదారులకు, కిరాణా, ఫ్యాన్సీ షాపుల యజమానులకు, వినియోగదారులకు ప్లాస్టిక్ వల్ల ప్రబలే రోగాలను వివరించారు.

బోధిధర్మ అవార్డు స్వీకరణ

ఆలమూరు: మండలంలోని జొన్నాడకు చెందిన కుంగ్ ఫూ మాస్టర్ కె.సత్తిబాబు ప్రతిష్ఠాత్మక బోధిధర్మ అవార్డుకు ఎంపికయ్యారు. ఇటీవల విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో దక్షిణ భారతదేశంలో ఉన్న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిశా, కర్ణాటక, తమిళనాడుకు చెందిన మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ టీం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. సౌత్ జోన్‌లో ఉన్న వందలాది మంది కుంగ్ ఫూ మాస్టర్లలో కేవలం 40 మంది మాస్టర్లకు మాత్రమే ఈ అవార్డు దక్కింది. అందులో భాగంగా జొన్నాడ నుంచి వారియర్ మాంక్స్ కుంగ్‌ఫూ మాస్టర్ సత్తిబాబు మంగళవారం బోధిధర్మ అవార్డు స్వీకరించారు. మాస్టర్ మాట్లాడుతూ వారియర్ మాంక్స్ కుంగ్‌ఫూ ద్వారా రాబోయే రోజుల్లో మరింత మంది విద్యార్థులకు శిక్షణ అందిస్తామన్నారు. ఈ అవార్డును తీసుకోవడం చాలా సంతోషంగా ఉందని సత్తిబాబు తెలిపారు.



రాయవరంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



తోటపేటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న గ్రామీణ వైద్యుడు పీవీవీ సత్యనారాయణ తదితరులు



గొల్లపాలెంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కె.గంగవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

మహానేత.. సంక్షేమ ప్రదాత

- అభివృద్ధికి చిరునామాగా వైఎస్సార్
- పేద వర్గాల ఆశాజ్యోతి
- స్మరించుకున్న నాయకులు, ప్రజలు, అభిమానులు

కపిలేశ్వరపురం: పాలన అంటే ప్రభుత్వ లబ్ధి సామాన్యుని గడపకు చేరాలి. మానవత్వంతో చేసే సాయాన్ని ఇంటి తలుపుతట్టి చేయాలి. అడగకుండానే ముందస్తు ఆలోచన చేసి చేయాల్సిన సాయాన్ని అందజేయాలి. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో అదే జరిగింది. జనం గుండె చప్పుడై ప్రజల కోసం నిరంతరం తపించారు. జనానికి భౌతికంగా దూరమై 16 ఏళ్లు గడిచినా ఆ మహనీయుడిని జనం గుండెల్లో పెట్టుకున్నారు. ఆయన 16వ వర్ధంతిని మండపేట నియోజకవర్గంలోని మండపేట పట్టణం, రూరల్ మండలంలోని 12 గ్రామాలు, కపిలేశ్వరపురం మండలంలోని 19 గ్రామాలు, రాయవరం మండలంలోని 12 గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు.

మండపేట పట్టణంలో..

పట్టణంలోని రాజారత్న సెంటర్‌లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు పిల్లి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు వేగుళ్ల పట్టాభిరామయ్య చౌదరి, రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, కో–ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, జెడ్పీటీసీ కురుపూడి భవాని నివాళులర్పించారు. ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ, వైఎస్సార్ అనగానే ఆరోగ్యశ్రీ,, ఫీజు రీయింబర్స్‌మెంట్, రుణమాఫీ పథకాలు గుర్తుకొస్తాయన్నారు. సంక్షేమానికి సింబల్ సాగిన ఆయన పాలన యావత్ దేశాన్ని ఆలోచించేలా చేసిందన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న మున్సిపల్ వైస్ చైర్మన్ వేగుళ్ల నారయ్య బాబు, విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్లు, సిరిపురం శ్రీనివాస్, ఆలీఖాన్ బాబా, యాండ్ర ప్రభాకర్ రావు, శెట్టి నాగేశ్వరరావు, పెంకే గంగాధర్, ముమ్మిడివరపు బాపిరాజు, జిన్నూరి సాయిబాబా, గెద్దం గాంధీ మాట్లాడారు.

రూరల్ మండలం ఏడిదలో పలివెల సుధాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పసుమర్తి నాగేశ్వరరావు, రాష్ట్ర యువజన విభాగ సహాయ కార్యదర్శి వాసిరెడ్డి అర్జున్, వల్లూరి రామకృష్ణ మాట్లాడుతూ, వైఎస్సార్ పాలనా తీరును వివరించారు. కేశవరంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దూలం వెంకన్న బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అన్నందేవుల కృష్ణ, తుపాకుల ప్రసన్నకుమార్, అద్దంకి రమణ పాల్గొన్నారు.



మండపేటలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

కపిలేశ్వరపురం మండలంలో..

అంగరలోని వైఎస్సార్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ మండల కమిటీ అధ్యక్షుడు గూటం సత్యనారాయణ, జెడ్పీటీసీ అబ్బు, నాయకుడు మేడిశెట్టి దుర్గారావు, వైస్ఎంపీపీ భాను ప్రసాద్, సర్పంచ్‌లు వాసా కోటేశ్వరరావు, ఆదిలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మేడిశెట్టి దుర్గారావు, అడ్డాల శ్రీనివాస్, పుట్టా కృష్ణమూర్తి, నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, వైఎస్సార్ జీవితం కష్టకాలంలో సైతం ఉత్తేజాన్ని ఇస్తుందన్నారు. ఆయన స్ఫూర్తితో ప్రజల్లో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. అద్దంకివారిలంకలో వైస్ ఎంపీపీ సాకా శ్రీనివాస్, వల్లూరులో పుట్టా సత్యనారాయణ, కేదారిలంకలో యర్రంశెట్టి నాగేశ్వరరావు, పోలిశెట్టి గణేష్ నివాళులర్పించాచారు. తాతపూడి, కపిలేశ్వరపురం, వెదురుమూడి, పడమర ఖండ్రిక, నేలటూరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నల్లూరు, కాలేరు, టేకి, మాచర, కోరుమిల్లి, నాగులచెరువు, వాకతిప్ప గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు.

రాయవరం: మదిలో మహానేతగా కొలువైన దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సేవలను మండల ప్రజలు గుర్తు చేసుకున్నారు. నమస్తే అన్నయ్యా.. నమస్తే తమ్ముడూ.. నమస్తే చెల్లెమ్మా అనే రాజన్న మాటలను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. రాయవరం మండలంలో రైతు బాంధవుడు రాజశేఖరరెడ్డి వర్ధంతి వేడుకలు మంగళవారం నిర్వహించారు. రాయవరంలో వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పారిశ్రామికవేత్త తేతల సుబ్బరామారెడ్డి, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, మండపేట ఏఎంసీ మాజీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పార్టీ నేతలు తమలంపూడి గంగాధరరెడ్డి పడాల కమలారెడ్డి తదితరులు నివాళులర్పించారు. సోమేశ్వరంలో నిర్వహించిన వర్ధంతి కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కోట వెంకట్రావు, పార్టీ నాయకులు కాటంరాజు, కత్తుల అప్పారావు, గుత్తి రాజు తదితరులు నివాళులర్పించారు. పసలపూడిలో పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సర్పంచ్ కడలి పద్మావతి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయి రామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు నివాళులర్పించారు. మాచవరంలో రాజన్న విగ్రహానికి పార్టీ నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదల గుండెల్లో కొలువైన వైఎస్సార్

రామచంద్రపురం/రామచంద్రపురం రూరల్: విద్య, వైద్యం కోసం నిరుపేదలు అప్పుల పాలై పేదరికం చేతిలో ఓడిపోతున్నారని గుర్తించి ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ పథకాల ద్వారా పేదరికాన్ని ఓడించి ప్రజల గుండెల్లో మహానేత వైఎస్సార్ దేవుడిగా నిలిచిపోయారని రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్ అన్నారు. రామచంద్రపురం పట్టణంలో మంగళవారం మహానేత వైఎస్సార్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, మున్సిపల్ చైర్మన్ గాదంశెట్టి శ్రీదేవి, రామచంద్రపురం ఎంపీపీ అంబటి భవాని, కె.గంగవరం ఎంపీపీ పంపన నాగమణి, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ పేదల పిల్లలు ఇంజినీరింగ్, వైద్యం తదితర ఉన్నత చదువులు చదువుకుని, ఉన్నత ఉద్యోగాలు పొందడం ద్వారా వారి కుటుంబాలు ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన మహనీయుడు వైఎస్సార్ అన్నారు. జోహార్ వైఎస్సార్ అంటూ నినాదాలు చేశారు. ద్రాక్షారామ పంచాయతీ వద్ద వైఎస్సార్ విగ్రహానికి దళిత నాయకుడు గుబ్బల శ్రీను, వార్డు సభ్యుడు దేగల వెంకటరమణ, బీసీ నాయకులు పెంకే వీరరాఘవులు, పిల్లి శ్రీను, నివాళులర్పించారు. వెల్లలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పోలినాటి వరప్రసాద్, మాజీ కన్వీనర్ పంతగడ విజయప్రసాద్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తోటపేటలో గ్రామీణ వైద్యుడు పీవీవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో వైయెస్సార్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కోట వాసుదేవ, జుత్తుగ గణేశ్, రెడ్డింశెట్టి శ్రీనివాసరావు, కోట లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: మండల గ్రామాల్లో వైఎస్సార్ వర్ధంతిని ప్రజలు ఘనంగా జరిపారు. గ్రామాల్లోని వాడవాడల్లో ఉన్న వైఎస్సార్ విగ్రహాలకు నాయకులు అభిమానులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలంలోని గొల్లపాలెంలో పార్టీ నియోజకవర్గ యువజన విభాగ అధ్యక్షుడు మాదిరెడ్డి పృథ్వీరాగ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ నాయకుడు పోతురాజు బాబూరావు, తణుకువాడలో పార్టీ నియోజకవర్గ బీసీ సెల్ కన్వీనర్ పితాని సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పార్టీ నాయకుడు పితాని లీలాశంకర్ మొగలిపాలెంలో వైఎస్సార్ మందిరం వద్ద పార్టీ గ్రామ కమిటీ చైర్మన్ తాడి గనిరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా నాయకులు కర్రి బస్విరెడ్డి, మహానేత విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే పలు గ్రామాల్లో ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుల ఆధ్వర్యంలో వర్ధంతిని నిర్వహించారు.

కె.గంగవరంలో..

కె గంగవరం: స్థానిక వైఎస్సార్ కాలనీ వద్ద దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ కార్యక్రమం ఎంపీపీ పంపన నాగమణి ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షుడు పట్టా శ్రీనివాస్, మండల యువజన అధ్యక్షుడు మేడిశెట్టి గోవిందరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొన్నారు.



రామచంద్రపురంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కోఆర్డినేటర్ సూర్యప్రకాష్

రైతులకు అవగాహన కల్పించండి

కాజులూరు: ప్రభుత్వం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఉచితంగా అందజేస్తున్న ఎలుకలమందు పంపిణీపై రైతులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సిబ్బందిని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ కోరారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో మంగళవారం జరిగిన వీఏఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండల గ్రామాల్లో ప్రస్తుతం వరి పంటపై ఎలుకల బెడద ఎక్కువగా ఉందన్నారు. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయశాఖ ఎలుకల నివారణకు బ్రోమోడయోలిన్ మందును ఉచితంగా సరఫరా చేస్తుందన్నారు. ఈ మందును బుధవారం మండలంలోని అన్ని ఆరెస్కేల ద్వారా రైతులకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో భాగంగా మందు ఎరను తయారు చేసుకునే విషయంపై సిబ్బందికి శిక్షణ ఇచ్చారు.

నేడు సామూహిక నిర్మూలన

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో నేడు సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి టీవీఆర్ మణిదీప్ మంగళవారం విలేకరులకు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణాధికారులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొంటారన్నారు. రైతులు సద్వినియోగం చేసుకుని ఎలుకలను నియంత్రించుకోవాలని, వాటి వృద్ధిని అదుపులో ఉంచడం ద్వారా పంట నష్టాన్ని నివారించుకోవాలని కోరారు.

కె.గంగవరంలో..

కె.గంగవరం: బ్రోమోడయోలిన్ మందుల పంపిణీని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో సద్గురుమూర్తి అన్నారు. మండలంలోని పామర్రు, యండగండి తదితర గ్రామాల్లో మంగళవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని వరి చేలు పొట్ట తగిలే దశలో ఉన్నందున ఎలుకల ఉధృతి ఎక్కువగా ఉంటుందన్నారు. దీనిపై బుధవారం మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో నూకలు మందు కలిపిన పొట్లాలు సరఫరా చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. రైతులందరూ సామూహికంగా గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా వారి పంటలో ఎలుకలు వల్ల వాటిల్లే నష్టాన్ని నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీఏఏ హరిబాబు, శ్రీలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.



కాజులూరులో ఎలుకల మందు పంపిణీపై సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ఏఓ

వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు

రాయవరం: ఆహార నియమాలు పాటించడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం ద్వారా మధుమేహాన్ని నియంత్రించవచ్చని వైద్యుడు శోభా శరణ్ పేర్కొన్నారు. రాయవరం వెలంపేట కమ్యూనిటీ హాల్‌లో మంగళవారం కమ్యూనిటీ పారా మెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు నిర్వహించారు. రాయవరం ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో శోభశరణ్ మాట్లాడుతూ, అధిక సంఖ్యలో ప్రజలు మధుమేహం బారిన పడుతున్నారన్నారు. శరీరం ఉత్పత్తి చేసే ఇన్సులిన్‌ను సమర్థవంతంగా ఉపయోగించలేని సందర్భంలో మధుమేహం బారిన పడతామన్నారు. గ్లూకోజ్ అసాధారణంగా పెరిగిన సందర్భంలో శరీరంలో అనేక వ్యవస్థలకు ముఖ్యంగా నరాలకు, రక్త నాళాలకు తీవ్రమైన నష్టం కలుగుతుందన్నారు. వైద్య నిపుణులు డాక్టర్ పవన్ కుమార్ మాట్లాడుతూ, వర్షాకాలంలో వచ్చే టైఫాయిడ్, మలేరియా వంటి వ్యాధులపై అవగాహన కల్పించారు. శోభాచరణ్, పవన్‌కుమార్‌ను ఘనంగా సత్కరించారు. సదస్సులో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పీఎంపీ అసోసియేషన్ జిల్లా నాయకులు పి.దేవానందం, సూరంపూడి వీరభద్రరావు, వాసంశెట్టి నాగేశ్వరరావు, డి.సాయిరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సత్కరిస్తున్న పీఎంపీ అసోసియేషన్ నేతలు

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఆలమూరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మంగళవారం మృతి చెందినట్లు ఆలమూరు ఎస్సై జి.నరేష్ తెలిపారు. గత ఆగస్టు 11న రావులపాలెం మండలం రావులపాడు గ్రామానికి చెందిన కటకం మోహన్‌రావు (52) రాజమహేంద్రవరం నుంచి రావులపాడుకు ద్విచక్ర వాహనంపై వస్తుండగా ఆలమూరు మండలంలోని జొన్నాడ ఆంజనేయస్వామి గుడి వద్దకు వచ్చేసరికి ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో మోహన్‌రావు గాయపడినట్లు ఎస్సై తెలిపారు. గాయపడిన ఆయనను రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో ఉన్నట్లు ఆయన వివరించారు.

కాపాడికొనేదెలా..!

- చూడిలో మెళకువలు పాటిస్తే మేలు
- పునరుత్పత్తి అంశంపై శ్రద్ధ అవసరం
- రైతులు నిర్లక్ష్యం వహించొద్దంటున్న వైద్యులు

రాయవరం: పాడి పశువుల పెంపకంలో పునరుత్పత్తి (ఈత) అంశంపై రైతులు శ్రద్ధ కనబర్చాలి. ముఖ్యంగా పశువులకు చూడి కట్టించడంలో మెళకువలు పాటిస్తే ఎంతో మేలు చేకూరుతుంది. ఈతకు ఈతకు మధ్య 14 నుంచి 15 నెలలు ఎడం ఉంటేనే లాభదాయకం. అంతకన్నా ఎక్కువైతే పాడి పశువు వట్టిపోయే కాలం ఎక్కువై రైతుకు ఆర్థిక నష్టం వాటిల్లుతుంది. చూడి కట్టించడంలో తగిన మెలకువలు పాటించాలని మాచవరం పశు వైద్యాధికారిణి బిందు సూచిస్తున్నారు. ఆమె సూచిస్తున్న వివరాలివే..

నిర్లక్ష్యం వహించరాదు

గేదె ఈనిన 3 నుంచి 4 నెలల్లో ఎద లక్షణాలు గుర్తించాలి. వీలైనంత వరకు కృత్రిమ గర్భధారణతో పాడి గేదెను చూడి కట్టించాలి. చూడి పశువు పాలు తక్కువ ఇస్తుందనే అపనమ్మకంతో ఎద లక్షణాలు



డాక్టర్ బిందు

కనిపించినప్పటికీ కృత్రిమ గర్భధారణ చేయకుండా కొందరు రైతులు నిర్లక్ష్యం వహిస్తుంటారు. దీని వల్ల ఈతకు ఈతకు మధ్య కాలం పెరిగి సుమారు 6– 8 నెలలు, అంతకు మించితే పాడి కాలం నష్టపోతారు. పాడి పశువు ఆరోగ్యం బాగున్నట్‌లైతే అది, చూడిగా ఉన్నా.. పాల దిగుబడి యథావిధిగా ఉంటుంది. పాడి పశువులు ఈనడానికి రెండు నెలల ముందు పాలు పితకడం ఆపేయాలి.

చల్లని వాతావరణంలో

గేదెలు సాధారణంగా వేసవి కాలంలో ఎదకు రావు. వాటికి చల్లని వాతావరణం కల్పించినట్‌లైతే వేసవిలో కూడా ఎదకు వచ్చే ఆస్కారముంది. గేదెలను రోజుకు రెండు, మూడు సార్లు చల్లని నీటితో కడగాలి. అవకాశం ఉన్న చోట నీటిలో ఈదేలా చూడాలి. గేదెలను వెలుతురు చూడనివ్వకుండా 2–3 గంటలు చీకటిలో ఉంచితే ఎదకు వచ్చే అవకాశం ఉంది. కృత్రిమ గర్భధారణ చేసిన వెంటనే వేసవికాలంలో గేదెలను చల్లటి నీటితో కడిగినా, నీటిలో ఈదించినా లేదా నీడలో కట్టి వేసినా చూడి నిలిచే అవకాశం ఎక్కువగా ఉంది. తగిన పోషక విలువలు కలిగిన పచ్చిమేత, ఖనిజ లవణాల మిశ్రమం ఇవ్వాలి. తగిన మోతాదులో మేత ఇవ్వకపోతే ఎదకు ఆలస్యంగా వస్తాయి.

మూగ ఎద లక్షణాలివే

కొన్ని రకాల గేదెల్లో ఎద లక్షణాలు స్పష్టంగా కన్పించవు. దీనినే 'మూగ ఎద' అంటారు. దీనిని గుర్తించకపోతే చాలా నష్టపోవాల్సి వస్తుంది. పశువు తెల్లని తీగలు వేస్తుంటుంది. ఈ తీగలు కోడిగుడ్లను పగుల గొట్టినప్పుడు వచ్చే తెల్లని సొన మాదిరిగా ఉంటాయి. గేదె తరచూ మూత్రం పోస్తుంటుంది. వేసక్టమీ చేసిన దున్నపోతును నాలుగు గంటలకు ఒకసారి మందలో తిప్పితే గేదెల్లో మూగ ఎదను గుర్తించే వీలుంటుంది. ఎద లక్షణాలు 24 గంటల నుంచి 36 గంటలు ఉంటాయి. ఎద మధ్య దశలో మాత్రమే కృత్రిమ గర్భధారణ చేయాలి. అప్పుడే చూడి నిలుస్తుంది.



దూడకు పాలు ఇస్తున్న పాడి గేదె

చెత్త సమస్యపై వ్యాపారుల ఆందోళన

మలికిపురం: మండలంలోని లక్కవరంలో మంగళవారం వ్యాపారులు ఆందోళన చేశారు. ప్రతిరోజు ఉదయం సెంటర్లో వ్యాపార సంస్థల వద్ద స్వీపర్లు శుభ్రం చేసేవారని, ప్రస్తుతం చాలా రోజుల నుంచి శుభ్రం చేయకపోవట వలన అధిక వర్షాలకు వ్యర్థాలు కుళ్లి కూడలితో పాటు రోడ్డంతా దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నామని ఆందోళన చేశారు. పంచాయతీ పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. దీంతో ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలుతున్నాయని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు ఆరోపించారు. వెంటనే సెంటర్లో ఉన్న చెత్త తొలగించి బ్లీచింగ్ కొట్టించి శుభ్రం చేయించవలసినదిగా పంచాయతీ కార్యదర్శి అబ్బాస్‌ను కోరారు. కార్యక్రమంలో పలచోళ్ళ నారాయణరావు, శృంగారపు సూర్యప్రకాశరావు, మండేలా రామ్మూర్తి, రాయుడు లక్ష్మణ్, పలచోళ్ళ రాంబాబు, పూలకొట్టు రంగా, బోనం ప్రభాకర్, ఊరింకి శ్రీనివాసరావు, బోనం బాబ్జి తదితరులు పాల్గొన్నారు.